# అన్నం పరబ్రహ్మ స్వరూపం

పీసపాటి గిరిజా మనోహర శాస్త్రి,

అన్నం పరబ్రహ్మ స్వరూపం. సకలజీవకోటికి ప్రాణాధారం ఆహారం. అన్నాన్ని సాక్షాత్తు అన్నపూర్ణాదేవిగా కొలుస్తాము. ఈ అన్నంతో ఈ సృష్టి అంతా ముడిపడి ఉన్నది. అన్నోత్పత్తి గురించి ఉపనిషత్తులలో ఏమి తెలియజేశారో తెలిపేముందర విశ్వసృష్టి పంచభూతాల ఆవిర్భావము తెలియజేయబడింది. విశ్వసృష్టి క్రమంలో మూడు తత్వాలు తెలియజేయబడ్డాయి. అవి ప్రకృతి, పురుషుడు, పరమాత్మ. విశ్వసృష్టిలో మూలమైనవి ప్రకృతి, పురుషుడు. ఇక్కడ పురుషుడు అంటే ప్రాణికోటి. విశ్వంలో మొదట వాయురాకాశములను పంచభూతాలు వ్యక్తమైనవి. ఆకాశము, వాయువు, తేజము, జలము, భూమి అయిన ఈ పంచభూతాలు వరసగా ఒకదాని వలన ఒకటి పుట్టినవి. ఈ విషయమే తైత్తిరీయోపనిషత్తునందు తెలియజేయబడింది.

శ్రు॥ ఆత్మానఆకాశసంభూతః। ఆకాశాద్వాయుః।

వాయోరగ్నిః। అగ్ని రాపః। అద్భ్యఃపృథివీ॥

మొదట ఆత్మనుండి ఆకాశము ఉద్భవించిందన్నారు. ఇక్కడ ఆత్మ అంటె పరమాత్మ అనగా పరబ్రహ్మము (పైన తెలిజేసిన పరమాత్మ గురించి ఇక్కడ ప్రస్తావించాడు). అనంతరం ఆకాశమునుండి వాయువు; వాయువు నుండి అగ్ని; అగ్నినుండి జలము; జలమునుండి పృథ్వి పుట్టినవి. ఈ పంచభూతాల గురించి తెలియజేసిన తరువాత వాటికి ఏఏ గుణాలు కలిగి ఉన్నాయో తెలియజేసారు. అవి ఆకాశానకు శబ్ధ గుణము; వాయువునకు శబ్ద స్పర్శ గుణాలు; అగ్నికి శబ్ద స్పర్శ రూప గుణాలు; జలానికి శబ్ద స్పర్శ రూప రస గుణాలు; పృథ్వికి (భూమికి) శబ్ద స్పర్శ రూప రస గంధము(వాసన) గుణాలు కలిగి వున్నాయి.

దీనినే తైత్తిరీయబ్రహ్మవల్లి ఈ క్రింది విధంగా వివరించినది.

శ్రు॥ తస్మాద్వా ఏతస్మా ద్వాత్మనా ఆకాశ స్సంభూతః- ఆకాశా ద్వాయుః, వాయో రగ్నిః అగ్నే రాపః

అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషదయః - ఓషధీభ్యోన్నమ్ అన్నా త్పురుషః

అనగా సర్వానికి ఆత్మభూతమైనది పరమాత్మ. ఇక్కడ పరమాత్మ అనగా పరబ్రహ్మమని చెప్పబడినది. అట్టి బ్రహ్మమునుండి శబ్ద గుణము కలిగినట్టి ఆకాశము, ఆకాశమునుండి శబ్ద స్పర్శ గుణములు కలిగినట్టి వాయువు జనించినది. అట్టి వాయువు నుండి శబ్ద స్పర్శ రూపము గుణములు కలిగినట్టి అగ్ని, అట్టి అగ్ని నుండి శబ్ద స్పర్శ రూప రసములనెడి నాలుగు గుణములు కలిగిన జలము పుట్టినది, అట్టి జలము వలన శబ్ద స్పర్శ రూప రస గంధము లనెడి అయిదు గుణములు కలిగినట్టి పృథ్వి జనించాయి. పృథ్వినుండి అనగా భూమి నుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము, అన్నము నుండి మానవుడు అనగా ప్రాణికోటి జనించినదని తెలుపబడింది. ఇట్లు పరబ్రహ్మం వలన ఏర్పడిన సృష్టి అంతా ఒక్కటే అయి అన్నస్వరూపమైనది. దీని వలన తెలుస్తున్నది అన్నము పరబ్రహ్మ స్వరూపమని.

మరొక విషయం మానవుని కంటె ముందర అన్నం పుట్టింది. ఇదే విషము తైత్తరీయ బ్రహ్మవల్లిలో ఈ విధంగా అన్నాడు. శ్రు॥"అన్నా ద్భూ భూతానని జాయన్తే" అన్నము వలన సర్వప్రాణులు జనిస్తున్నాయి.

భృగువల్లి ఉపనిషత్తులో ఆ విధంగా జనించిన జీవులకు జీవనాధారమైన ఆహారం గుఱించి తెలియజేశాడు. శ్రు॥" అన్నా ద్ధ్యేవ ఖిల్వమాని భూతాని జాయన్తే" అనగా ఆకాశం నుండి కురిసిన వృష్టి వలన సకల ప్రాణులకు జీవనాధారమైన సస్యాలు పండుతున్నాయి అని వివరించాడు. అనగా అన్నరూపమైన సస్యములు స్థూలరూపమున ముందు పుట్టి తరువాత జనించిన ప్రాణులకు ఆహారమగుచున్నది. "అన్నా ద్భూతానని జాయన్తే" అన్న శ్రుతి ప్రకారం అన్నము నుండి స్థావర జంగమాత్మక, జడ, చేతన జీవులుత్పన్న మైనట్లు స్పష్టమైనది. అన్నమే అన్నపూర్ణ. ఇట్లు అన్నపూర్ణ సృష్టికి కారణమైనది.

బ్రహ్మవల్లి ఉపనిషత్తులో శ్రు॥'అన్నేన జాతాని జీవన్తి, జాతాన్యన్నేన వర్ధన్తే' అని అన్నాడు. అనగా అన్నము వలన పుట్టినవి అన్నము వలననే పెరుగుతున్నాయి, వృద్ధిచెంది నిలుస్తున్నాయి. అనగా ఈ విధంగా అన్నం స్థితికి కూడా కారణ మయింది.

ఇట్టి సృష్టికి స్థితికి కారణమైన అన్నపూర్ణకు పరమాత్మకు భేదములేదు. పరమాత్మ స్వరూపమైన అన్నపూర్ణయందు మనకు భక్తి జనిస్తోంది. అన్నమునకు పరబ్రహ్మమునకు భేదము లేదని భృగుమహర్షి" అన్నం బ్రహ్మేతి వ్యజనాత్" అనగా అన్నము బ్రహ్మ అని అన్నాడు. కనుక' అన్నం ననిన్ద్యాత్ 'అనగా అన్నమును నిందించకు, 'అన్నం నపరిచక్షీత్ 'అన్నమును పరిహరించకు

అనగా విడువకు అని కూడా తెలియజెప్పాడు. అన్నదానం విరివిగా చేయమని కూడా శ్రుతిలో చెప్పాడు. 'అన్నం బహుకుర్వీత 'అనగా అతిథి అభ్యాగతులకు లేదనకుండా అన్నం పెట్టమని అర్థము.

శ్రు॥ అన్నవా నన్నాదో భవంతి, మహాన్ భవతి ప్రజాయా, పశుభి ర్బ్రహ్మ వర్చసేన, మహాన్ కీర్త్యా॥ (భృగువల్లి) అన్నము ఇతరులకు పెట్టుటవలన అనగా అన్నదానము వలన, అతడు గొప్పవాడు మహాత్ముడు అగు చున్నాడు. పుత్రపౌత్రాది పరివారము చేతను, సంపద చేతను జ్ఞానము కలిగిన బ్రహ్మ వర్చస్సు చేతను అభివృద్ధి పొందుచున్నాడని అర్థము. అన్నపూర్ణాదేవిని ఆరాధించమని, అట్లు ఆరాధించిన మోక్షంకలుగునని అన్నాడు. శ్రు॥' యేన్నం బ్రహ్మో పాసతే। సర్వంవై॥ ' తేన్నమాప్నువంతి॥ (బ్రహ్మవల్లి) అనగా అన్నమును యెవరు బ్రహ్మముగా ఉపాసించుచున్నారో వారు సకలాన్ని పొందుచున్నారు. అన్నపూర్ణా ధ్యాన శ్లోకంలో 'జ్ఞానసిద్ధ్యర్థం' అని యోగము చెప్పబడినది. జ్ఞానము ద్వారా కదా మోక్షసిద్ధి కల్గుతుంది.